సాక్షి
వికారాబాద్
మంగళవారం । 31 । జనవరి । 2023



ఎట్టకేలకు బీటీ రోడ్డుకు మోక్షం
ఎట్టకేలకు పులుమామిడి, లింగంపల్లి బీటీ రోడ్డుకు మోక్షం లభించింది. ఇందుకు సంబంధించిన పనులు చేపట్టారు. 8లో▸



విద్యాభివృద్ధికి కృషి
విద్యార్థులు పట్టుదలతో పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. 8లో▸



రుణమాఫీ అమలయ్యేనా!
ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ హామీ నెరవేరుతుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

నేడు దౌలాపూర్‌కు మంత్రుల రాక
యాలాల: దౌలాపూర్ సమీపంలో నిర్మించనున్న రైస్ మిల్లు, గోదాం పనులను ప్రారంభించేందుకు మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితా రెడ్డితో పాటు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి తెలిపారు. రూ.2.50 కోట్లతో నిర్మించే పనులను మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

హత్యాయత్నం నిందితులకు రిమాండ్



రిమాండ్‌కు తరలించిన నిందితులు దశరథ్, సుభాష్

పరిగి: ఆస్తి కోసం సొంత మామను చంపేందుకు ప్రయత్నించిన వ్యక్తితో పాటు ఇతనికి సహకరించిన మరో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న పరిగి పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో చిగురాల్‌పల్లి గ్రామానికి చెందిన హరిదాస్‌పల్లి పెంటయ్య అనే వ్యక్తిపై అతని అల్లుడైన సుభాష్ కత్తితో దాడి చేశాడు. ఈ క్రమంలో 16 పోట్లు పొడిచి హత్యకు ప్రయత్నించాడని ఎస్‌ఐ పేర్కొ న్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించామని తెలిపారు. భూమి కోసం పూడూరు గ్రామానికి చెందిన దశరథ్‌తో కలిసి హత్య చేసేందుకు ప్రయత్నించామని నేరం ఒప్పుకోవడంతో నిందితులను కోర్టులో హాజరు పర్చి, రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి
పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి

చేవెళ్ల: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎంతో కృషి చేస్తోందని సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఊరెళ్ల, దేవుని ఎర్రవల్లి, మల్కాపురం, గుండాల, చందనవెల్లి గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఆర్టీయూ పోరాటం మేరకు ఉపాధ్యాయులకు పదోన్నతులతో కూడిన బదిలీల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఉపాధ్యాయులకు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేలా మూలవేతనం నుంచి 1 శాతం వేతనం అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, మండల అధ్యక్షుడు సత్యగౌడ్, ప్రధాన కార్యదర్శి వినోద్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, వెంకటేశం, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ధారూరులో ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు
ధారూరు: మండల కేంద్రంలో టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు అందుబాటులో ఉన్నాయని, తాండూరు డిపో పరిధిలో ఇవి కొనసాగుతాయని సర్పంచ్ చంద్రమౌళి తెలిపారు. వ్యాపారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కౌంటర్ ఏజెంట్‌గా కుర్వ రవిని నియమించామని పేర్కొన్నారు. వివరాలకు తాండూరు ఎగ్జిక్యూటివ్ సెల్: 9154298739, ధారూరు ఏజెంట్ 9959518634లో సంప్రదించాలని సూచించారు.

ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం
రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ తిరుపతిరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ 60 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వాటిని జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కొత్త హంగులు



ప్రారంభానికి సిద్ధమైన మాదారం ప్రాథమికోన్నత పాఠశాల

13 పాఠశాలల్లో 'మనబడి' పనులు పూర్తి
- రేపటి ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం
- హర్షం వ్యక్తంచేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మొదటి విడత కింద ఎంపికైన స్కూళ్లు:	386
నిధుల అంచనా:	రూ.72 కోట్లు
రూ.7 లక్షలలోపు అవసరమైనవి:	38

వికారాబాద్ అర్బన్: మన ఊరు- మనబడి కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలు కొత్త కళను సంతరించుకున్నాయి. వీటిలో మౌలిక వసతులు కల్పిస్తూ కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో మొత్తం 1,054 పాఠశాలలు ఉండగా మొదటి విడత కింద 386 స్కూళ్లను ఎంపిక చేసింది. వీటిని అన్నిరకాలుగా అభివృద్ధి చేసేందుకు రూ.72 కోట్లు అవసరమని సంబంధిత అధికారులు ప్రతిపాదించగా.. దశలవారీగా నిధులు విడుదల చేస్తోంది. ఈ ఫండ్స్‌తో ప్రహరీలు, విద్యుత్ దీపాలు, ఫర్నిచర్, బ్లాక్ బోర్డులు, మరుగుదొడ్లు, పచ్చదనం తదితర పనులు చేస్తున్నారు.

38 స్కూళ్లలో పనులు

మన ఊరు- మన బడి కార్యక్రమంలో ఎంపిక చేసిన పాఠశాలలను 2022- 23 విద్యా సంవత్సరం నాటికి అన్ని హంగులతో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. కానీ ఈమేరకు పనులు జరగలేదు. మొదటి ఫేజ్‌లో ఎంపిక చేసిన 386 స్కూళ్లలో వివిధ కారణాలతో ఒకేసారి పనులు ప్రారంభించలేకపోయారు. దీంతో కొన్ని పాఠశాలల్లోనైనా పనులు పూర్తిచేయాలని అధికారులు నిర్ణయించారు. రూ.7 లక్షల వరకు అవసరమైన 38 స్కూళ్లను సెలెక్ట్ చేసి పనుల్లో వేగం పెంచారు. వీటిలో అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. లక్ష్యం ముగిసినా పనులు పూర్తి కాకపోవడంతో స్కూళ్ల సంఖ్యను 19కి కుదించారు. ఇది కూడా సాధ్యం కాకపోవడంతో చివరకు 13 పాఠశాలలను ఫైనల్ చేసి ఫిబ్రవరి 1న ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.



పాఠశాలలకు చేరిన డ్యుయల్ డెస్క్ బెంచీలు

నయా లుక్

ఇన్నాళ్లు పాతబడ్డ భవనాల్లా కనిపించిన ప్రభుత్వ పాఠశాలలు మన ఊరు మనబడితో కొత్త శోభను సంతరించుకున్నాయి. మన బడికి ఎంపికైన స్కూళ్లలో మేజర్, మైనర్ రిపేర్లు పూర్తవడంతో సమస్యలు చాలా వరకు తీరాయి. పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు సరిపడా టాయిలెట్స్, అవసరమైన చోట ప్రహరీలు నిర్మించారు. ప్రతీ తరగతి గదిలో ఫ్యాన్లు, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. డ్యుయల్ డెస్క్‌లు, అల్మారాలు, బ్లాక్ బోర్డులు సమకూర్చారు. భవనం ముందు భాగంలో రెయిలింగ్ ఏర్పాటు చేశారు.

రేపే ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా 13 స్కూళ్లను బుధవారం పారంభించనున్నారు. ఇందులో బొంరాస్‌పేట మండలం చౌట్టుపల్లితండా ప్రాథమిక పాఠశాల, చౌడాపూర్ మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల, దోమ మండలం శివారెడ్డిపల్లి ప్రాథమిక, దౌల్తాబాద్ మండలం నర్సాపూర్ ప్రాథమిక, కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ ప్రాథమిక, మోమిన్‌పేట్ మండలం చంద్రాయన్‌పల్లి, అమ్రాదికుర్దు ప్రాథమిక, నవాబుపేట్ మండలం మాదారం ప్రాథమికోన్నత, పరిగి మండలం కడ్లాపూర్ ప్రాథమికోన్నత, పెద్దేముల్ మండలం కందనెల్లి ప్రాథమిక, పూడూరు మండలం మన్నెగూడ ప్రాథమిక, తాండూరు మండలం గౌతాపూర్ ప్రాథమిక, యాలాల మండలం దేవనూర్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.

మొదటి విడతకు సిద్ధం



మొదట 38 పాఠశాలలు అనుకున్నాం. కొన్నింటిలో చిన్నచిన్న కారణాల వల్ల పనులు కదలడం లేదు. ఫిబ్రవరి 1న మొత్తం 13 స్కూళ్లను ప్రారంభించేందుకు సిద్ధం చేశాం. వీటిలో అన్ని మౌలిక వసతులు కల్పించాం. మరో పది రోజుల్లో మరిన్ని పాఠశాల్లో పనులు పూర్తవుతాయి. దశలవారీగా వీటిని కూడా ప్రారంభిస్తాం.

– రేణుకాదేవి, డీఈఓ

ఆ బాధ్యత ఉపాధ్యాయులదే
- సర్కారు బడుల్లో అన్ని వసతులు కల్పిస్తాం
- కలెక్టర్ నిఖిల
- పలు పాఠశాలల పరిశీలన

మోమిన్‌పేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ నిఖిల అన్నారు. మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లి, అంరాదికుర్దులో మన ఊరు- మనబడి కింద ఎంపికైన పాఠశాలలను అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తయారు చేస్తామన్నారు. విద్యార్థులను తీసుకురాల్సిన బాధ్యత మాత్రం టీచర్లదేనని స్పష్టంచేశారు. చంద్రాయన్‌పల్లి పాఠశాల గదులను పరిశీలించిన అధికారులు బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కూల్ ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు అంజయ్య, సుమిత్ర, ఉప సర్పంచు వెంకట్‌రెడ్డి, డీఈఓ రేణుకాదేవి, ఎంఈఓ గోపాల్, ఎంపీఓ యాదగిరి, ఏఈఈ ప్రణీత్‌కుమార్, ఆర్‌ఐ రాజు, ప్రధానోపాధ్యాయులు రమేశ్, దేవ్యానాయక్ తదితరులు ఉన్నారు.

నాణ్యత పాటించాలి

నవాబుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు- మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నిఖిల అధికారులను ఆదేశించారు. మాదారం ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్, హ్యాండ్‌వాష్, ఫ్లోరింగ్, కలరింగ్ తదితర పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాల ఆవరణలో ఫ్లవర్ పాట్స్, గ్రీన్ చాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట డీఈఓ రేణుకాదేవి, ఈడబ్ల్యూడీసీ డీఈ రాజు, మండల ప్రత్యేకాధికారి నవీన్‌చంద్ర, ఎంఈఓ గోపాల్, ఎంపీఓ విజయ్‌కుమార్, సర్పంచ్ అంజయ్య తదితరులు ఉన్నారు.



మోమిన్‌పేటలోని చంద్రాయన్‌పల్లిలో పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిఖిల, అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఈఓ రేణుకాదేవి తదితరులు

70వేల మందికి కంటి పరీక్షలు
రంగారెడ్డి కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కంటి వెలుగు కార్యక్రమం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 70,795 మందికి స్క్రీనింగ్ చేసినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్, సీఎస్ శాంతకుమారి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అమయ్‌కుమార్ మాట్లాడారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చి, రోగుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నట్లు తెలిపారు. పోడు భూములకు సంబంధించి ఇప్పటికే రైతులతో గ్రామాలవారీగా చర్చలు జరిపి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు. మన ఊరు మన బడి పథకం కింద జిల్లాలో ఇప్పటికే 38 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లో శివస్వాముల ర్యాలీ

ఘనంగా ఘటాభిషేకం
వికారాబాద్ పట్టణంలో సోమవారం శివస్వాములు శత ఘటాలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధులు గుండా శివనామస్మరణ చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ముందుగా బసవేశ్వరుడి విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలలతో అలంకరించారు. అనంతరం ఆలయానికి చేరుకొని శివలింగానికి అభిషేకం చేసి హారతి ఇచ్చారు. స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

– అనంతగిరి

మా సార్‌ను బదిలీ చేయొద్దు..



మేడిపల్లికలాన్ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

పూడూరు: 'మా సార్‌ను బదిలీ చేయొద్దు..మా స్కూల్‌లోనే ఉండాలి' అంటూ మేడిపల్లికలాన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం ఆందోళన చేపట్టారు. 2012లో మేడిపల్లికలాన్ పీఎస్‌కు ఖాజామొయినొద్దీన్ అనే ఉపాధ్యాయుడు వచ్చారు. ప్రస్తుత బదిలీల్లో తమ సార్ మరోచోటకు వెళ్లనున్నట్లు తెలియడంతో తల్లిదండ్రులతో కలిసి స్కూల్ ఎదుట విద్యార్థులు నిరసన చేపట్టారు. స్కూల్‌కు చేరుకున్న సదరు ఉపాధ్యాయుడు వారి అభిమానానికి కంటతడి పెట్టారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, రవికుమార్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇటు స్పీడ్.. అటు స్లో



ఎల్‌బీనగర్ నుంచి మల్కాపూర్ రూట్‌లో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



హైదరాబాద్- బీజాపూర్ మార్గంలో ప్రారంభం కాని పనులు

ఎక్స్‌ప్రెస్‌వే తరహా రోడ్ల విస్తరణ పనులు
- రూ.545 కోట్లతో ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు..
- రూ.928.41 కోట్లతో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ దాకా..
- త్వరగా పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలంటున్న ప్రయాణికులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో చేపట్టిన రెండు జాతీయ రహదారుల విస్తరణ పనుల్లో ఒకటి ఆగుతూ..సాగుతుండగా.. మరొకటి జెట్ స్పీడ్‌తో ముందుకు వెళ్తోంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కేంద్రం రూ.1,473.41 కోట్ల అంచనా వ్యయంతో జిల్లాలోని ఇటు హైదరాబాద్ నుంచి బీజాపూర్ వెళ్లే ఎన్‌హెచ్-163 (అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లేన్లు), అటు హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ఎన్‌హెచ్- 65 (ఎల్బీనగర్ నుంచి దండు మల్కాపురం వరకు ఆరులేన్లు) రోడ్డు విస్తరణ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు చేపట్టిన పనులు వేగంగా పూర్తవుతుండగా.. అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు చేపట్టిన పనులు మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. అధికారుల అలసత్వానికి తోడు.. భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో చోటు చేసుకుంటున్న జాప్యం, రోడ్డుకు అటు ఇటుగా విస్తరించిన మర్రిచెట్ల తొలగింపుపై నెలకొన్న వివాదమే ఇందుకు కారణంగా తెలిసింది.

వడివడిగా ఎన్‌హెచ్-65 విస్తరణ పనులు

హైదరాబాద్ నుంచి రంగారెడ్డి జిల్లా మీదుగా విజయవాడవైపు వెళ్లే జాతీయ రహదారి ఎన్‌హెచ్-65 (ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు 25 కిలో మీటర్ల వరకు)ని ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లుగా విస్తరించాలని నిర్ణయించి, ఈ మేరకు ఇటీవల పనులు చేపట్టింది. ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ వరకు ఎక్కడా సిగ్నల్ లేకుండా ప్రయాణించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు రూ.545 కోట్లు ఖర్చవుతున్నట్లు అంచనా వేసింది. స్థానికులకు ఇబ్బంది కలుగకుండా వనస్థలిపురం, సుష్మా, పనామా, హయత్‌నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ జంక్షన్, కవాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, ఇనాంగూడ, బాటసింగారం మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో అండర్ పాసుల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణకు అనుగుణంగా ప్రస్తుతం కొత్తగూడెం వద్ద ఉన్న వాగుపై రూ.25 కోట్లతో ఎనిమిది లేన్లతో బ్రిడ్జిని ఇప్పటికే పూర్తి చేసింది. ఈ రోడ్డు విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాదిలోగా దాదాపు పూర్తయ్యే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.

ఆగుతూ...సాగుతూ..

హైదరాబాద్ నుంచి బీజాపూర్ వరకు (ఎన్‌హెచ్-163) జాతీయ రహదారి విస్తరించింది. ఈ రోడ్డుపై అటు ఇటుగా రోజుకు సగటున 50 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం ఈ రోడ్డు రెండు లేన్లే ఉంది. ఇరుకైన ఈ దారిపై మొయినాబాద్, చేవెళ్ల, వికారాబాద్ ప్రజలు రాకపోకలు సాగిస్తూ తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే అనేక మంది మృత్యువాతపడ్డారు. ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు సుమారు 46 కిలోమీటర్ల దూరంలో నాలుగు లేన్ల విస్తరణ పనులు చేపట్టింది. నిజానికి ఈ రోడ్డును ఆరు లేన్లుగా విస్తరించాలని నిర్ణయించి, భూ సేకరణలో తలెత్తుతున్న ఇబ్బందుల దృష్ట్యా దీన్ని ప్రస్తుతం నాలుగు లేన్లకు కుదించింది. ఇప్పటికే రోడ్డుకు అటు ఇటుగా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రహరీల తొలగింపు పనులు మొదలు పెట్టింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మొయినాబాద్ సమీపంలోని జేబీఐటీ నుంచి కనకమామిడి వరకు (సుమారు నాలుగు కిలోమీటర్లు) బైపాస్‌రోడ్డుతో పాటు చేవెళ్ల కేసారం నుంచి దామరగిద్ద వరకు (సుమారు ఆరు కిలోమీటర్లు) బైపాస్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టింది. రైతులు, ఇతర ప్రజలకు ఇబ్బంది కలగకుండా సర్వీసు రోడ్లతో పాటు ఈ మార్గంలో మొత్తం 18 చోట్ల అండర్ పాస్‌లు నిర్మించాలని నిర్ణయించింది. ప్రస్తుతం పనులు ఆగుతూ.. సాగుతున్నాయి.

8 వారాల్లో ఎన్నికలు నిర్వహించండి
రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నందిగామ మండలం అంతిరెడ్డిగూడ పంచాయతీకి ఎనిమిది వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పుల అనంతరం అంతిరెడ్డిగూడ 2020లో కొత్త పంచాయతీగా ఏర్పడినా ఎన్నికలు నిర్వహించడం లేదంటూ అదే గ్రామానికి చెందిన అంజియాదవ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సర్పంచ్ లేని కారణంగా మూడేళ్ల నుంచి ప్రత్యేక అధికారి పాలనే సాగుతోందని, ఎన్నికలు నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది పొన్నం అశోక్‌గౌడ్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం పైతీర్పునిచ్చింది.

క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని ఎక్సైజ్‌ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 10గంటలకు వాహనాలకు వేలం వేయనున్నట్లు ఎక్సైజ్‌ సీఐ సైదులు తెలిపారు. పలు కేసుల్లో జప్తు చేసిన వాహనాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ. 5వేలు చెల్లించాలని తెలిపారు.

2నుంచి సదరమ్‌ క్యాంప్‌లు

వికారాబాద్‌ అర్బన్‌: దివ్యాంగుల కోసం ఫిబ్రవరి 2వ తేదీ నుంచి సదరమ్‌ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కృష్ణన్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2న వికారాబాద్‌లో, 9న తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో, 16న వికారాబాద్‌లో, 23న తాండూరు ప్రభుత్వ ఆస్పత్రిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి క్యాంపులో 50 మంది వరకు మొత్తం 200 మంది వరకు అసెస్‌మెంట్‌ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘డయల్‌ యువర్‌ చైర్‌పర్సన్‌’కు 20 ఫిర్యాదులు



ఫోన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మంజుల

వికారాబాద్‌ అర్బన్‌: మున్సిపాలిటీ అభివృద్ధే తమ లక్ష్యమని చైర్‌పర్సన్‌ మంజుల అన్నారు. సోమవారం నిర్వహించిన డయల్‌ యువర్‌ చైర్‌పర్సన్‌ కార్యక్రమంలో 20 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి వారం వస్తున్న ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గత వారం 9 ఫిర్యాదులు రాగా నాలుగింటిని పరిష్కరించినట్లు తెలిపారు. ఎక్కువ నిధులతో కూడిన పనులను తర్వలో చేపట్టనున్నట్లు చెప్పారు. డ్రైనేజీ, పారిశుద్ధ్య, మంచినీటి సమస్యలను తక్షణం పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. డీఈ రామ్‌కిషన్‌, శానిటేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ మొయినొద్దీన్‌ తదిపాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి



పనుల పురోగతిని తెలుసుకుంటున్న అడిషనల్‌ కలెక్టర్‌ రాహుల్‌శర్మ

కుల్కచర్ల: మన ఊరు మన బడి పనుల్లో వేగం పెంచాలని అడిషనల్‌ కలెక్టర్‌ రాహుల్‌ శర్మ ఆదేశించారు. సోమవారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల్లో పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఫిబ్రవరి 1వ తేదీ నాటికి పాఠశాలలను ప్రారంభించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ లక్ష్మి, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ సర్పంచ్‌గా జగన్‌



ప్రశంసా పత్రం అందుకుంటున్న సర్పంచ్‌ జగన్‌

పరిగి: బహుజన సాహిత్య అకాడమీ మండలంలోని రాఘవపూర్‌ సర్పంచ్‌ జగన్‌కు జాతీయ ఉత్తమ సర్పంచ్‌ అవార్డును ప్రకటించింది. సోమవారం ఆ అకాడమీ కేంద్ర కార్యాలయంలో సర్పంచ్‌కు ప్రశంసా పత్రం అందజేశారు. మార్చి 12న ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగే సౌత్‌ ఇండియా బహుజన రైటర్స్‌ సమావేశంలో అవార్డును ప్రదానం చేయనున్నారు.

ఎట్టకేలకు బీటీ రోడ్డుకు మోక్షం

- రూ. 80 లక్షలు మంజూరు
- ప్రారంభమైన పనులు
- తీరనున్న రవాణా కష్టాలు



చురుగ్గా సాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

నవాబుపేట: ఎట్టకేలకు పులుమామిడి, లింగంపల్లి బీటీ రోడ్డుకు మోక్షం లభించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నవాబుపేట పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పులుమామిడి మీద లింగంపల్లి నుంచి ఎల్లకొండ వరకు ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి తీవ్రంగా గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న మట్టి కూడా కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకేసారి ఎదురెదురుగా వాహనాలు వస్తే గుంతల కారణంగా రోడ్డు దిగేందుకు భయాందోళన చెందేవారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య రోడ్డు నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేయించారు. ఇటీవల అధికారులు పనులను ప్రారంభించారు. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హోరెత్తిన శివనామస్మరణ

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి నివాసంలో మహాపడి పూజ
- ప్రత్యేక పూజలు, హాజరైన మాలధారులు



శివపార్వతులకు క్షీరాభిషేకం చేస్తున్న రామ్మోహన్‌రెడ్డి దంపతులు

పరిగి: పట్టణంలోని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి నివాసంలో సోమవారం శివస్వాముల ద్వాదశ జ్యోతిర్లింగ మహా పడిపూజ వైభవోపేతంగా జరిగింది. ఈ పూజ కార్యక్రమానికి శివస్వాములు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతం శివనామస్మరణతో మార్మోగింది. రామ్మోహన్‌రెడ్డి దంపతులు శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పరమశివుని దీవెనలతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషంగా ఉండాలని వేడుకున్నారు. శివుని కృపతో ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం కేసీఆర్‌ నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ సిద్ధాంతి పార్థసారథి, యువ నాయకులు రితిక్‌రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకులు లాలుకృష్ణ ప్రసాద్‌, హన్మంతు ముదిరాజ్‌, పరశురాంరెడ్డి, ఎర్రగడ్డపల్లి కృష్ణ, భీంరెడ్డి, భరత్‌కుమార్‌, తమ్మన్నగారి మధుకర్‌రెడ్డి, అనంతరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే సత్ఫలితాలు

జిల్లా నోడల్‌ అధికారి శంకర్‌



వ్యక్తిత్వ వికాసంపై సూచనలు చేస్తున్న జిల్లా నోడల్‌ అధికారి శంకర్‌

దోమ: విద్యార్థులు ఇష్టంతో చదివితే సత్ఫలితాలు వస్తాయని జిల్లా నోడల్‌ ఆఫీసర్‌ శంకర్‌ అన్నారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉదయం నుంచి రాత్రి వరకు చేసే పనుల్లో విజ్ఞానంతో కూడిన పనులు కూడా ఉంటాయన్నారు. వాటిని గుర్తించి ఆ దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ మంజుల, అధ్యాపకులు శ్రీధర్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధికి కృషి

- పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలి
- డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌రెడ్డి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ అందజేస్తున్న మనోహర్‌రెడ్డి

కుల్కచర్ల: విద్యార్థులు పట్టుదలతో పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని డీసీసీబీ చైర్మన్‌ బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. సోమవారం చౌడాపూర్‌ మండలం చాకల్‌పల్లి, మరికల్‌, కొత్తపల్లి, మందిపల్‌, చౌడాపూర్‌ గ్రామాల్లోని జెడ్పీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదో తరగతి అనేది అత్యంత కీలకమని, కావున పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలన్నారు. సెల్‌ ఫోన్లు, టీవీలతో కాలక్షేపం చేయరాదని సూచించారు. కరోనా అనంతరం గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో కొంత ఇబ్బందిని ఎదుర్కొంటున్న తమ దృష్టికి వచ్చిందన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్‌ నాయక్‌, మహ్మదాబాద్‌ పీఏసీఎస్‌ చైర్మన్‌ శ్రీనివాస్‌రెడ్డి, కుల్కచర్ల పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ నాగరాజు, బీఆర్‌ఎస్‌ చౌడాపూర్‌ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌ కొత్త రంగారెడ్డి, మందిపల్‌ సర్పంచ్‌ మఠం ప్రమీల, నాయకులు నర్సింలు, యాదయ్య, కృష్ణయ్య, మఠం రాజశేఖర్‌, శివకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలతోనే సుపరిపాలన

జెడ్పీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌



పంచాయతీ అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్‌ తదితరులు

మోమిన్‌పేట: గ్రామ పంచాయతీలతోనే సుపరిపాలన సాధ్యమని జెడ్పీ వైస్‌ చైర్మన్‌ విజయ్‌కుమార్‌ పేర్కొన్నారు. సోమవారం మోమిన్‌పేటలో రూ. 15.50లక్షలతో నూతనంగా నిర్మించిన పంచాయతీ అదనపు సమావేశ మందిరాన్ని ఆయన సర్పంచ్‌ అంగేరి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలోనే పంచాయతీల్లో అభివృద్ధి సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకొని ఆరుబయట మల మూత్ర విసర్జనకు స్వస్తి పలికినట్లు తెలిపారు. ప్రతిరోజూ గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ కేవలం తెలంగాణలోనే జరుగుతోందన్నారు. చెత్త సేకరణతో గ్రామాలు స్వచ్ఛంగా తయారయ్యాయి అన్నారు. మిషన్‌ భగీరథ పథకం ద్వారా తాగునీరును అందించడం వల్ల నీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమైందని తెలిపారు. అంతర్గత సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీల నిర్మాణంతో పంచాయతీ అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ నరేష్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు డీ వెంకట్‌, కార్యదర్శి నర్సింలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి వివాహిత మృతి



అంబమ్మ మృతదేహం

యాలాల: ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి వివాహిత మృత్యువాత పడింది. ఈ ఘటన మండలంలోని ఎన్కెపల్లి గేటు సమీపంలో సోమవారం ఉదయం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. బషీరాబాద్‌ మండలం గంగ్వార్‌ గ్రామానికి చెందిన మేకల అంబమ్మ(27)కు నాలుగేళ్ల క్రితం తాండూరు మండలం బెల్కటూరు గ్రామానికి చెందిన లింగప్పతో వివాహం జరిగింది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న అంబమ్మను తల్లి భీమమ్మ, భర్త లింగప్ప ఆదివారం ఎన్కెపల్లి శివారులోని మల్లన్న గుడికి తీసుకొచ్చారు. అనంతరం గేటు సమీపంలోని ఓ నీటి గుంతలో కాళ్లు కడుక్కొని వస్తానని చెప్పి వెళ్లిన అంబమ్మ తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకుండా పోయింది. సోమవారం నీటి గుంతలో అంబమ్మ మృతదేహం తేలడంతో కుటుంబ సభ్యులు యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తల్లి భీమమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేగదూడలకు టీకాలు



లేగ దూడకు టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌

అనంతగిరి: పశువుల్లో బ్రుసెల్లోసిస్‌ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌ తెలిపారు. జాతీయ బ్రుసెల్లోసిస్‌ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్‌ పరిధిలోని కొత్తగడి, మద్గుల్‌ చిట్టంపల్లిలో రెండు పశు వైద్య బృందాలతో 4 నుంచి 8 నెలల వయసు గల ఆడ లేగలకు, గేదేలు, దూడలకు టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో వచ్చే నెల 4వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. బ్రుసెల్లోసిస్‌ వ్యాధి సోకితే ఆడ దూడి పశువులు ఈసుకుపోవడం (అబార్షన్‌)వంటి అవకాశాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధి ముఖ్యంగా పశువుల నుంచి మనుషులకు సోకే అవకాశం ఉందన్నారు. టీకాలు వేస్తే జీవితకాలం వ్యాధి బారిన పడకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏడీ ప్రహ్లద్‌, పశువైద్యాధికారి టీ ఉష తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చేవెళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. చేవెళ్ల ఎస్‌ఐ ప్రదీప్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని గుండాల గ్రామానికి చెందిన జవాజీ లక్ష్మయ్య(48) ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిగానే ఈ నెల 29న తన స్నేహితుడు రాజుతో కలిసి శంకర్‌పల్లి మండలంలో పనిచేసేందుకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా శంకర్‌పల్లి మండలం టంగుటూరు స్టేజి వద్ద వీరి బైక్‌ను ఎదురుగా వస్తున్న మరో బైక్‌ వేగంగా ఢీకొట్టింది. దీంతో లక్ష్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. నగరంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

క్షయ రహిత జిల్లాగా మారుద్దాం

- టీబీ నివారణ జిల్లా అధికారి రవీంద్రయాదవ్‌
- ఆరుగురికి న్యూట్రిషన్‌ కిట్లు అందజేత



న్యూట్రిషన్‌ కిట్లను అందజేస్తున్న రవీంద్రయాదవ్‌, దాతలు

తాండూరు టౌన్‌: వికారాబాద్‌ను క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించాలని క్షయ వ్యాధి నివారణ జిల్లా అధికారి రవీంద్రయాదవ్‌ అన్నారు. సోమవారం ప్రధాన మంత్రి టీబీ ముక్త్‌ భారత్‌ కార్యక్రమంలో భాగంగా విశ్రాంత ఉపాధ్యాయులు గాజుల బస్వరాజ్‌ ఆధ్వర్యంలో టీబీ వ్యాధి గ్రస్తులకు న్యూట్రిషన్‌ కిట్లు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రవీంద్రయాదవ్‌ మాట్లాడుతూ క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి, వైద్యుల సలహా ప్రకారం మందులు వాడాలని సూచించారు. పేదరికంలో ఉన్న క్షయ వ్యాధి గ్రస్తులు ఆరుగురికి ఏడాదికి సరిపడే న్యూట్రిషన్‌ కిట్లను దాతలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సబ్‌ యూనిట్‌ అధికారి మల్లేశం, సీనియర్‌ ల్యాబ్‌ సూపర్‌ వైజర్‌ బస్వరాజ్‌, ల్యాబ్‌ టెక్నీషియన్‌ మధుశీల తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. అండగా ఉండండి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి జనార్దన్‌రెడ్డి

అనంతగిరి: ఉపాధ్యాయుల సేవకు నా జీవితం అంకితం చేస్తానని టీపీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలోని పలు పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ సవ్యంగా జరుగుతోందని, ఎలాంటి అపోహలు వద్దన్నారు. భాషాపండితులు, పీఈటీల సమస్యలు త్వరలో పరిష్కారమవుతాయని ఎవరూ అధైర్య పడరాదని సూచించారు. మూడోసారి పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో టీపీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా అధ్యక్షులు విజయ, ప్రధాన కార్యదర్శి మల్లేశం, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు శివకుమార్‌, దత్తు, యూనియన్‌ నాయకులు, ఉపాధ్యాయులు శ్యాంకుమార్‌, శ్రీధర్‌, గోపాల్‌రెడ్డి, కేశవులు, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌, మామిడి వెంకటరాంరెడ్డి, పుష్పలత, వాణి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కొందుర్గు: జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్‌ చౌరస్తాలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్సై సక్రమ్‌ తెలిపారు. మృతిచెందిన వ్యక్తి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మృతుడి ఒంటిపై బూడిద రంగు గీతల చొక్కా, నీలం రంగు బనియన్‌, నీలం రంగు జీన్స్‌ పాయింట్‌ ఉన్నాయని చెప్పారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆసుపత్రికి మర్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాలుడిని ఢీకొన్న వాహనం

డ్రైవర్‌ పరార్‌

కడ్తాల్‌: మండల పరిధిలోని శ్రీశైలం–హైదరాబాద్‌ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కర్కల్‌పహాడ్‌ చౌరస్తా వద్ద మధ్యాహ్నం సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిశంకర్‌ గౌడ్‌ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్‌ గ్రామానికి చెందిన ఆరేళ్ల బాలుడు అరుణ్‌తేజ్‌ జాతీయ రహదారిపై నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్‌ నుంచి కల్వకుర్తి వైపు అతి వేగంగా ప్రయాణిస్తున్న బొలేరో వాహనం బాలుడిని ఢీకొట్టింది. దీంతో బాలుడి బాలుడికి తలకు, కాళ్లకు తీవ్రగాయాలయై పడిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు, వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బొలేరో డ్రైవర్‌ వాహనాన్ని వేగంగా నడుపుకుంటూ పరారయ్యాడు. అరుణ్‌తేజ్‌ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం



మణిదీప (ఫైల్‌)

పహాడీషరీఫ్‌: నర్సింగ్‌ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌ తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన పులిజాల తిరుపతయ్య కుమార్తె మణిదీప(22) బీఎస్సీ నర్సింగ్‌ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 28న ఉదయం 11.30 గంటలకు ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిన మణిదీప తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌లో గానీ, 94906 17241 నెంబర్‌లోగానీ సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

భార్యతో గొడవపడి..



రవితేజ(ఫైల్‌)

కందుకూరు: భార్యతో గొడవ పడిన వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. కందుకూరు సీఐ కృష్ణంరాజు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నేదునూరు గ్రామానికి చెందిన తిమ్మగళ్ల రవితేజ(27) ఈ నెల 24న భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కొండల్‌ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9490617237, 7901103284 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

తల్లిదండ్రులు మందలించడంతో..



హిమాన్ష్‌(ఫైల్‌)

ఇబ్రహీంపట్నం రూరల్‌: పాఠశాలకు వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది.ఆదిబట్ల సీఐ రవికుమార్‌ తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్‌ కమ్మగూడలో నివాసం ఉండే ప్రభాకర్‌ కుమారుడు హిమాన్ష్‌ (13) విజ్ఞాన్‌ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పది రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ నెల 29న రాత్రి 11గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎక్కడ వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి ప్రభాకర్‌ ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌

కొత్తూరు: కొత్తగా ఏర్పడిన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్‌ రూ.. 32.51కోట్ల నిధులను మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ తెలిపారు. ఇందులో భాగంగా ఆయన సోమవారం మున్సిపల్‌ కార్యాలయంలో నిధుల మంజూరుకు సంబంధించిన వివరాలను పాలకవర్గం సభ్యులకు వివరించారు. తనతో పాటు కౌన్సిలర్లు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో పర్యటించి అక్కడ నెలకొన్న ప్రధాన సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. పాలకవర్గం తీర్మానంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనులకు అందరు సహకరించాలని కోరారు. మంజూరైన నిధులతో సీసీరోడ్లు, అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీతో పాటు పలు పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఇప్పటికే మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్‌, నూతన మున్సిపల్‌ కార్యాలయ భవనాల నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన హనుమాన్‌ ఆలయంలో నిర్వహిస్తున్న నవగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషన్‌ వీరేందర్‌, వైస్‌ చైర్మన్‌ జోలి రవీందర్‌, కౌన్సిలర్లు మాదారం నర్సింహ్మగౌడ్‌, సోమ్లనాయక్‌, నాయకులు దేవేందర్‌యాదవ్‌, సుదర్శన్‌గౌడ్‌, దేవేందర్‌ముదిరాజ్‌, ఎమ్మె సత్యనారాయణ, లక్ష్మయ్య, జే. శ్రీను, రాజేందర్‌గౌడ్‌, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

కండక్టర్‌కు ‘స్ఫూర్తి సేవారత్న’



భిక్షపతికి పురస్కారం అందజేస్తున్న మోహన్‌రావు

ఇబ్రహీంపట్నం: ఎల్మినేడు గ్రామానికి చెందిన ఆర్టీసీ కండక్టర్‌ బజారు భిక్షపతి ఎన్నో ఏళ్లుగా పేదలకు, అనాథలకు, వృద్ధులకు సేవలు చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన యువచైతన్య వెల్ఫేర్‌ సొసైటీ స్ఫూర్తి సేవారత్న జాతీయ పురస్కారాన్ని అందజేసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వివేకానంద, సుభాష్‌ చంద్రబోస్‌ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వెలుగు సాహితి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రావు భిక్షపతిని సన్మానించి, షీల్డ్‌, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌కుమార్‌, రవికిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.